ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 21 సెప్టెంబరు 2024



మాచవరం : పిన్నెల్లిలో వంద రోజుల పరిపాలన పై మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, జంగా కృష్ణమూర్తి

ప్రజల వద్దకు.. పాలకులు



సత్తెనపల్లి: ఇరుకుంపాలెంలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లకు గృహాలకు అంటిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పెదకూరపాడు : కాశిపాడులో ఇంటింటికి వెళ్ళి వంద రోజుల పాలన గురించి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

- కోలాహలంగా.. ఇది మంచి ప్రభుత్వం
- తొలి రోజు ప్రజల నుంచి అనూహ్య స్పందన
- పంచాయతీలు, వార్డుల్లో ఉత్సాహంగా కార్యక్రమాలు
- పింఛన్ల పెంపు, అన్నక్యాంటీన్ల ఏర్పాటుపై హర్షాతిరేకాలు
- నియోజకవర్గాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు
- సంక్షోభంలోనూ చంద్రబాబు వల్లే సంక్షేమం, అభివృద్ధి అన్న నేతలు

నరసరావుపేట, సెప్టెంబరు 20: మంచి చేశాం.. ప్రజల నుంచి మెప్పు పొందాం.. ఆ మంచిని చెప్పుకుందాం.. ప్రజల సమస్యలు తెలుసుకుందాం.. అంటూ ప్రజల వద్దకు పాలకులు వచ్చారు. ఇది మంచి ప్రభుత్వం.. పేరుతో ప్రజల హర్షాతిరేకాల మధ్య ఉత్సాహ పూరిత వాతావరణంలో శుక్రవారం జిల్లా అంతటా కోలాహలంగా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 26వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలతో పాటు అధికారులు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొననున్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలు.. ప్రజాహిత.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నారు. తొలి రోజు శుక్రవారం ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. రోజుకో గ్రామం, మున్సిపాలిటీలో ఒక వార్డు సందర్శించాలని ప్రభుత్వం ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ ప్రకారం గ్రామం, వార్డుల్లో అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అమలు చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేసి, మన మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ప్రజావేదిక నిర్వహించిన ఎమ్మెల్యేలు ప్రజల అభిప్రాయాలను, సమస్యలను తెలుసుకున్నారు. ఉత్సాహ వాతావరణంలో కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమా నికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పింఛన్ పెంపుదలపై అవ్వాతాతలు ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. పట్టణాల్లో నిర్వ హిస్తున్న అన్న క్యాంటీన్లలో కడుపు నింపుకుంటున్న పేదలు సీఎం చంద్రబాబును ప్రశంసించారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ నిర్వహణపై యువత ఆనందాన్ని వ్యక్తం చేస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యేలు ప్రజలకు భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక సంక్షేమ పథకాలు అమలులోకి రానున్నాయని ప్రజలకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు గురించి వారం రోజులపాటు ఈ కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులు, పార్టీలశ్రేణులు వివరించనున్నాయి.

● పెదకూరపాడు మండలం కాశిపాడు, గారపాడు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత కూటమి ప్రభుత్వం అనిపించుకుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధిని సీఎం చంద్రబాబు అమలు చేయనున్నారన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా మార్చనున్నారని చెప్పారు.

● ముప్పాళ్ల మండలం ఇరుకుపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2024 దృష్టిలో ఉంచుకుని మరింతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు.

● వినుకొండ మండలం దొండపాడులో ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభ జరిగింది. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రసంగిస్తూ వంద రోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి సీఎం చంద్రబాబు ఇది మంచి ప్రభుత్వం అని నిరూపించుకున్నారన్నారు. అవ్వాతాతలకు పింఛన్‌ను రూ.4 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టు ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించామన్నారు.

● మాచవరం మండలం పిన్నెల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తితో కలిసి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. అరాచక పాలన నుంచి విముక్తి పొంది ప్రజాస్వామ్యం వైపు ఉమ్మడి కూటమి ప్రభుత్వం పరుగులు తీస్తుందన్నారు.

● మాచర్ల, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొని ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించారు.

● నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు పాల్గొని వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచి పనులను సభలో వివరించారు. రానున్న రోజుల్లో అమలు చేయ నున్న సంక్షేమ కార్యక్రమాలను తెలిపారు.



వినుకొండ : దొండపాడులో ప్రభుత్వం చేసిన మంచి పనులపై ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తున్న జీవీ ఆంజనేయులు.



నరసరావుపేట : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు





కూరగాయలు కొనలేం

అమాంతం పెరిగిపోయిన ధరలు

- దొండకాయలు, వంకాయలు కిలో రూ.60
- పెద్ద చిక్కుళ్లు రూ.100, బంగాళదుంప రూ.50
- రెండు వారాల్లో రూ.20 నుంచి రూ.30 వరకు పెరుగుదల
- వర్షాలకు పంట పోవడంతో ధరలు పెరిగాయంటోన్న వ్యాపారులు

గుంటూరు, సెప్టెంబరు 20: కూరగాయ ధరలు కొండెక్కాయి. ఏ కూరగాయలు కూడా కొనేస్థితిలో లేవు. కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లిన ప్రజలు వాటి ధరలు చూసి కళ్లు తేలేస్తున్నారు. మార్కెట్లతో పాటు రైతు బజార్లలోనూ కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. కూరగాయల ధరలు మంటెక్కుస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొన్ని కూరగాయల ధరలు సాధారణంగా ఉంటే మరికొన్ని అమాంతం పెరిగిపోయాయి. ఇటీవల భారీ వర్షాలు, ముంచెత్తిన వరదలతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో కూరగాయ పంటలు నీట మునిగిపోయాయి. ఈ ప్రభావం వాటి ధరలపై పడింది. మొన్నటి వరకు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ఉండే దొండకాయ, వంకాయ ధరలు కూడా ప్రస్తుతం కిలో రూ.60కు చేరుకున్నాయి. ఇక మొన్నటి వరకు కిలో రూ.60 ధర పలికిన బెండకాయ ధర కాస్త దిగొచ్చి రూ.40 చేరుకుంది. పెద్ద మార్కెట్లోనే ధరలు ఇలా ఉంటే ఇక కాలనీల్లోని చిల్లర దుకాణాల్లో అంతకు మించి కిలోకు రూ.10 నుంచి రూ.15 వరకు పెంచి విక్రయిస్తున్నారు. ఇక పెద్ద చిక్కుళ్లు కాపు పెద్దగా లేదని కిలో రూ.100 విక్రయిస్తున్నారు. బంగాళదుంప కూడా కిలో రూ.50 వరకు పలుకుతుంది. రాష్ట్రంలో లభ్యత లేక పోవడంతో బెంగళూరు నుంచి దిగుమతి చేసుకోవడంతో క్యాలీ ఫ్లవర్ ఒక్కోటి రూ.50 నుంచి రూ.40 వరకు సైజును బట్టి విక్రయిస్తున్నారు. ఇక మార్కెటింగ్‌శాఖ నిర్వహించే రైతు బజార్లులో మాత్రం ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. అయితే అవి కూడా నాశిరకంగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఆకుకూరల ధరలూ అదుర్స్..

వర్షాలు, వరదలతో ఆకు కూరలు పొలాల్లోనే పాడయ్యాయి. దీంతో దిగుబడి లేక వాటి ధరలు కూడా అమాంతం పెరిగాయి. గోంగూర కట్ట రూ.10 ఉండగా తోటకూర, పాలకూర, చుక్కకూర కట్ట మార్కెట్లోనే రూ.10 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. కాలనీ ల్లోని దుకాణాల్లో కట్ట రూ.20కు విక్రయిస్తున్నారు. ఇక కొత్తిమీర కట్ట రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయి స్తున్నారు. మరికొన్ని రోజులు ఇవే ధరలు కొన సాగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఇసుక కష్టాలు.. తీర్చేదెవరు..?



మాదిపాడు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం బారులు తీరిన లారీలు

- రోజుల తరబడి మాదిపాడులో పడిగాపులు
- జిల్లాలో నిలిచిపోయిన ఇసుక సరఫరా
- రెండు వారాలుగా ఇదే దుస్థితి
- చేతులేత్తేసిన జిల్లా యంత్రాంగం
- బ్లాక్‌లో టన్ను ఇసుక రూ 1,800

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాలో ఇసుక కష్టాలు రోజురోజుకూ జఠిలమవుతోంది. జిల్లా అంతటికీ ఒకే చోట మాదిపాడు స్టాక్ యార్డులో మాత్రమే ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటని పంపిణీ చేయడంలో సదరు అధికారులు చేతులేత్తేశారు. దీంతో ఇసుక ధరకు బ్లాక్ మార్కెట్‌లో రెక్కలు వచ్చాయి. ఇసుక కొరతను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. నరసరావుపేటలో టన్ను ఇసుక రూ 1,800 బహిరంగంగానే విక్రయిస్తున్నారు. ఇసుక బుక్ చేసుకున్న నిర్మాణదారుడికి రెండు వారాలుగా ఇసుక సరఫరా చేస్తున్నా దాఖలాలు లేవు. లారీలు తీసుకువెళ్లి రోజుల తరబడి మాదిపాడు స్టాక్ పాయింట్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. అయినా ఇసుక లభించడంకపోతుండతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం వలనే ఇసుక సరఫరా కావడం లేదన్న విమర్శలున్నాయి. శుక్రవారం కూడా మాదిపాడు స్టాక్ పాయింట్ నుంచి ఇసుక లారీలకు లోడు చేయలేదు. అదేమిటని అడిగితే ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదని అధికారుల చెబుతుండటం గమనార్హం.

ఇసుక పొందేందుకు వినియోగదారులు రోజల తరబడి స్టాక్ యార్డు వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లాలోని వినుకొండ, కొండమోడు, కొత్తపల్లి, కోనూరు, వైకుంఠపురం స్టాక్ పాయింట్‌లలో ఇసుక నిల్వలు లేవు. ఒక్క మాదిపాడు స్టాక్ యార్డు లో మాత్రమే 24 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. నిల్వలు ఉన్నా సరఫరా జరగడంలేదు. దీంతో నిర్మాణాలు నిలిచిపోయి వినియో గదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇసుక కొరతను అవకాశంగా తీసుకుని కొందరు ప్రైవేట్ వ్యాపారులు అమాంతం ధరలు పెంచేవారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తున్నట్టు చెబుతున్నపటికి అచరణలో అమ లు కాకపోవడంతో బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇసుక సమస్య జిల్లాలో తీవ్ర స్థాయిలో ఉన్నా పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకుంటున్న దాఖలాలు లేవు. మైనింగ్ శాఖ ఇసుక సరఫరాపై చోద్యం చూస్తోందన్న విమర్శలున్నా యి. ప్రభుత్వ ఉచిన ఇసుక సరఫరాను అమలు చేయ డంతో జిల్లా యంత్రాగం పూర్తిగా విఫమైందన్న ఆరోప ణలున్నాయి. దాదాపు గత నెల 28 నుంచి ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని వినియోగదారులు తెలిపారు. కృష్ణానదికి వరద రావడంతో కొద్ది రోజులు ఇసుక సరఫరా అంతరాయం ఏర్పడింది. దాదాపు 15 రోజులుగా ఆ పరిస్థితి లేకున్నా ఉన్న ఇసుక నిల్వలను వినియోగదారులకు అందించే ప్రయత్నాలు జరగడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధిక రేట్లకు ఇసుక కొనుగోలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా జిల్లాలో ఇసుక సమస్య పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఇప్పటికీ టన్ను ఇసుకను రూ 1,800 కొనుగోలు చేయాల్సి వస్తుండటం వినియో గదారులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. 20 టన్నుల లారీ ఇసుక రూ 36 వేలకు బ్లాక్‌లో కొనుగోలు చేస్తూ నిర్మాణదారులు తీవ్రవంగా నష్టపోతున్నారు.

మాదిపాడు స్టాక్ యార్డులో ఇసుక నిల్వ



పల్నాడులోనే కొరత

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క పల్నా డు జిల్లాలోనే ఇసుకకు కొరత ఏర్పడింది. ఉన్న నిల్వలను సరఫరా చేయడంలేదు. జిల్లా ఉన్నతాధికారులు కూడా ఇసుక సరఫరాపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఇసుక బ్లాక్ మార్కెట్ తరలించి అధిక ధరలకు విక్రయి స్తున్నా చర్యలు తీసుకోవాల్సి అధికారులు మిన్న కుంటున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలో ఇసుక సరఫరా ఎప్పటికి గాడిలో పడుతుందో ఆ అధికారులకే తెలియాలి. ఉచిత ఇసుక అందిస్తు న్నామని ప్రభుత్వం చెబుతుంటే జిల్లాలో ఆ పరి స్థితి కానరాకపోవడంతో విని యోగదారుల పెద వి విరుస్తున్నారు. జిల్లాలో ఇసుక సరఫరాపై నెలకొన్న లోపాల ను సవరించే ప్రయత్నాలు ఇ ప్పటికైనా చేపట్టాల్సి ఉంది. ప్రజా ప్రతినిధులు కూడా ఇసుక కొరత తొలగించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెంచులకు కనీస వసతులు కల్పించాలి

పీఎం జన్‌మన్ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 20: జిల్లాలో ఏకైక పీజీవీటీ గ్రూప్‌గా గుర్తించిన చెంచులకు ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జన్‌మన్ కార్యక్రమంపై శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. ఆరు మండలాల్లోని 51 నివాస ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న 7235 మంది చెంచులకు ప్రధాన మంత్రి జన్‌మన్ ద్వారా 11 రకాల మౌలిక వసతులు అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని చెంచుల నివాస ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన 608 ఇళ్లు, 29.9 కిమీ రోడ్లు, 19 నివాసాలకు తాగునీటి సరఫరా, 11 మొబైల్ మెడికల్ యూనిట్లు, 16 హాస్టళ్లు, 18 అంగన్‌వాడీ సెంటర్లు, 782 విద్యుత్ కనెక్షన్లు, 8 మొబైల్ టవర్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పథకాలు అందించడంలో ఇబ్బందులు లేకుండా గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. వారంలోగా అందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు, మూడు వారాల్లో ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు, నెల రోజుల్లో ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. గతంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల విజ్ఞప్తి మేరకు చిలకలూరిపేట, బొల్లాపల్లి మండలాల్లో ఇప్పటి వరకు రికార్డులకెక్కని చెంచులను గుర్తించేందుకు సర్వే చేపట్టి వారంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో శ్రీశైలం ఐటీడీఏ ఏపీవో సురేష్, గురజాల ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, హౌసింగ్ పీడీ శివలింగం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, డీఎంహెచ్‌వో రవి, నరసరావుపేట, గురజాల డీఎల్డీవోలు వెంకటరెడ్డి, గబ్బునాయక్, డీఈవో ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి

నేర సమీక్షలో పోలీసులకు ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి సూచన

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 20: పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని, సున్నితమైన భాషతో మాట్లాడాలని రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి తెలిపారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి నేర సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ బాధితులతో మమేకమై సమస్యలను వినాలని, న్యాయం జరుగుతుందని వారిలో నమ్మకం కలిగించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్‌లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కి వచ్చే ఫిర్యాదులను నిర్ధిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి పోర్టల్‌లో డాక్యుమెంట్ అప్లోడ్ చేయాలన్నారు. నేరాలను అరికట్టేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్య పానం చేసే వారిపై చర్యలు తీసుకుని నేరాలను కట్టడి చేయాలన్నారు. దిశ, ఎమర్జెన్సీ కాల్స్‌లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వాటిపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలన్నారు. రౌడీలు, సస్పెక్ట్‌లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సారా తయారీ క్రయవిక్రయాలపై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. వివిధ కేసుల్లో ప్రతిభ కనపరిచిన సీఐలు బ్రహ్మయ్య, ఎం శ్రీనివాసరావు, సుబ్బరాయుడు, రమేష్, వెంకటరావు, ప్రభాకర్, జీ వెంకట్రావు, టీవీ శ్రీనివాసరావు, అబ్దుల్ రెహమాన్, ఎస్ఐలు బాలకృష్ణ, నాగేంద్రరావు, సుధీర్, సంధ్యారాణి తదితరులకు ఐజీ రివార్డులను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు సంతోష్, రామచంద్రరాజు, లక్ష్మీపతి, డీఎస్పీలు నాగేశ్వరరావు, హనుమంతరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

దిక్సూచి
DIKSUCHI

పర్యావరణం - అధ్యయనం



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణాన్ని ఆంగ్లంలో ఎన్విరాన్‌మెంట్ అంటారు. ఈ పదాన్ని ఫ్రెంచ్ భాష నుంచి గ్రహించారు. ఫ్రెంచ్‌లో ఎన్విరానర్ అంటే చుట్టూ ఆవరించి ఉండటం లేదా చుట్టుకొని ఉండటం అని అర్థం.

నిర్వచనాలు: మనచుట్టూ ఆవరించి ఉన్న గాలి, నీరు, నేల, జంతువులు, వృక్షాలు అనగా జీవ, నిర్జీవ వ్యవస్థల సమ్మేళనాన్ని 'పర్యావరణం' అంటారు. (లేదా) మానవుని చుట్టూ పరిసరాలు ఏర్పడటానికి కారణమయ్యే సాంఘిక, ఆర్థిక, జీవ, భౌతిక రసాయనిక కారకాల సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు.

డగ్లస్, హోలెండ్: జీవరాశుల జీవితాన్ని, స్వభావాన్ని, ప్రవర్తనను, అభివృద్ధిని, పరిపక్వతను ప్రభావితం చేసే అన్ని బాహ్య శక్తులు, ప్రభావాలు, పరిస్థితుల సమిష్టి స్వరూపాన్ని వర్ణించడానికి పర్యావరణం అనే పదాన్ని ఉపయోగిస్తారు.

- **ఎ.గౌడై:** తన గ్రంథం ద నేచర్ ఆఫ్ ద ఎన్విరాన్‌మెంట్‌లో భౌతిక పరిణామాలే పర్యావరణమని, దానిని ప్రభావితం చేసే వారిలో మానవుడు అతి ముఖ్యమైన వాడని చెప్పారు.
- **బోరింగ్:** ఈయన పిండోత్పత్తి నుంచి మృత్యువు వరకు వ్యక్తి పొందే భౌతిక స్పందనల సమ్మేళనమే పర్యావరణమని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణంపై అవగాహన కలిగించేందుకు 1974 నుంచి ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది.

పర్యావరణ అనుఘటకాలు

పర్యావరణం, జీవులు, నిర్జీవులు అనే రెండు ప్రాకృతికమైన అనుఘటకాలతో నిండి ఉంటుంది. పర్యావరణంలో రెండు అనుఘటకాలు ఉంటాయి. అవి-

ఎ) **జీవ అనుఘటకాలు:** వృక్షాలు, జంతువులు, సూక్ష్మజీవులు మొదలైనవి.

బి) **నిర్జీవ అనుఘటకాలు:** ఇవి మూడు రకాలు

1) **శీతోష్ణస్థితిపరమైనవి:** కాంతి, ఉష్ణం, వర్షపాతం మొదలైనవి.

2) **భౌతికపరమైనవి:** గాలి, నేల(మైదానాలు, పీఠభూములు, లోయలు మొదలైనవి), నీరు.

3) **రసాయనికపరమైనవి:** సేంద్రీయపరమైన కార్బొహైడ్రేట్స్, ప్రోటీన్స్, లిపిడ్స్, నిరీంద్రీయ పరమైన సోడియం, పొటాషియం, కాల్షియం, పాస్ఫరస్ మొదలైనవి.

పర్యావరణం - వర్గీకరణ

దీనిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) మానవ నిర్మిత పర్యావరణం/ కృత్రిమ పర్యావరణం

2) సహజసిద్ధ పర్యావరణం

1) మానవ నిర్మిత పర్యావరణం: మానవ నిర్మిత పర్యావరణాన్ని సామాజిక - సాంస్కృతిక పర్యావరణం అంటారు. సహజంగా ఏర్పడినవి కాకుండా మానవుడు తయారు చేసిన లేదా నిర్మించిన ఆవరణాన్ని మానవ నిర్మిత పర్యావరణంగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు పంట పొలాలు, అక్వేరియాలు, పూల తోటలు, చేపల చెరువులు, విద్యాసంస్థలు, పార్కులు, వాణిజ్య సంస్థలు మొదలైన వాటిని మానవ నిర్మిత పర్యావరణంగా పరిగణించవచ్చు.

2) సహజసిద్ధ పర్యావరణం: సౌర మండలంలో ఏ గ్రహానికి లేని విశిష్ట లక్షణం భూ మండలానికి ఉంది. జీవరాశికి అనువైన వాతావరణం ఒక్క భూ మండలానికే ఉంది. మన చుట్టూ ఉండే గాలి, నీరు, వివిధ జీవరాశులు అంటే మానవులు, జంతువులు, వృక్షాలు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు మొదలైన వాటిని కలిపి సహజసిద్ధ పర్యావరణం అంటారు. మానవుని ప్రమేయం లేకుండా భూమిపై గల అనుకూల శీతోష్ణస్థితి ప్రభావాల కారణంగా ఏర్పడినదే 'సహజసిద్ధ పర్యావరణం' అంటారు.

సహజసిద్ధ పర్యావరణాన్ని వాటి స్థితిని బట్టి నాలుగు రకాలుగా విభజించారు.

ఎ) వాతావరణం	బి) జలావరణం
సి) శిలావరణం	డి) జీవావరణం

ఎ) **వాతావరణం:** ఈ పదాన్ని గ్రీకు పదాలైన Atoms (vapour), Sphaira (Sphere) ఆవరణం నుంచి ఉద్భవించింది. గ్రీకుభాషలో అట్మాస్ అంటే గాలి/ఆవిరి అని అర్థం. ఈ ఆవరణాన్ని ఆంగ్లంలో అట్మాస్ఫియర్ అంటారు. భూమి పైభాగాన్ని కప్పి ఉన్న దుమ్ము, ధూళి, వాయువుల మిశ్రమాన్ని వాతావరణం అంటారు(లేదా) భూమిపై వ్యాపించి ఉన్న గాలి పొరను వాతావరణం అంటారు.

- భూమి చుట్టూ వాతావరణం లేకుంటే అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు, సౌర కిరణాలు భూమిపై ప్రసరించి అన్ని గ్రహాల వలే ఒక ఉష్ణగోళంగా మారిపోయి, జీవరాశులకు ఆవాసం లేకుండా పోయేది. భూగోళం చుట్టూ వాతావరణం ఉండటం వల్ల జీవరాశి మనుగడకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి సహజంగా వాతావరణంలో ఉన్న ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి మొదలైన వాటికి జీవ వైవిధ్యంలో కీలకపాత్ర ఉంది.
- వీటితోపాటు వాతావరణంలో దుమ్ము, ధూళి, లవణ కణాలు, సూక్ష్మ కణ రూపంలో ఉండి వాతావరణ ప్రక్రియల్లో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి.
- వాతావరణం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని మెటరాలజీ అంటారు.
- వాతావరణం మనల్ని వెచ్చగా ఉంచుతుంది. ఇది భూ ఉపరితల ఉష్ణోగ్రతలను నియంత్రిస్తుంది. తీవ్రమైన పగలు - రాత్రి ఉష్ణోగ్రత వ్యత్యాసాలను తగ్గిస్తుంది.
- గాలి, వర్షం, మంచు మొదలైన అంశాలు, వాతావరణంపైనే ఆధారపడతాయి. వర్షం, గాలులు లేకుంటే జీవుల మనుగడ కష్టమవుతుంది. ఈ విధులే కాకుండా వాతావరణం సూర్యుని నుంచి విడుదలయ్యే హానికర అతి నీలలోహిత కిరణాల వల్ల కలిగే నష్టాన్ని నివారించడంలో సహాయపడుతుంది.
- ప్రపంచ వాతావరణ దినోత్సవం మార్చి 23(1950 నుంచి మొదలు)
- **ప్రపంచ వాతావరణ దినోత్సవం 2021 థీమ్:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ
- **ఉద్దేశం:** పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు చెట్లను చురుకుగా నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం, పెరుగుతున్న కాలుష్య స్థాయిని తగ్గించడం.

వాతావరణం లక్షణాలు

- దీనికి రంగు, రుచి, వాసనలు ఉండవు. అయితే ఇది వాసనలను శబ్దాలను, ఒకచోట నుంచి మరో చోటకు మోసుకెళ్తుంది.
- ఇది పారదర్శకమైన లక్షణాన్ని కలిగి స్థితిస్థాపక శక్తిని కలిగి ఉంటుంది.
- భూమిని ఆవరించి ఉండటంతో సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతి నీలలోహిత కిరణాలను భూమిని చేరనీయకుండా జీవజాతిని రక్షిస్తుంది.
- వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించారు. యూఎస్ఎస్‌ఓ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుగుతుంది.



వి.వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి



చిరంజీవికి అక్కినేని అవార్డ్

మెగాస్టార్ చిరంజీవికి ఏయన్నార్ జాతీయ అవార్డ్ ఇవ్వనున్నట్లు హీరో నాగార్జున శుక్రవారం ప్రకటించారు. వచ్చే నెల 28న ఈ అవార్డ్‌ను ఆలిండియా మెగాస్టార్ అమితాబ్ చేతుల మీదుగా అందజేస్తామని ఆయన తెలిపారు. ఇకపై రెండేళ్లకు ఒకసారి ఈ అవార్డ్‌ను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయం చెప్పగానే చిరంజీవి ఎమోషనల్ అయ్యారనీ, ఇంతకంటే పెద్ద అవార్డ్ లేదన్నారని నాగార్జున చెప్పారు.లుగు చిత్ర పరిశ్రమలోనే కాకుండా భారతీయ చలన చిత్ర పరిశ్రమకు విశేష సేవలు అందించిన చిత్ర ప్రముఖులకు తన పేరుతో జాతీయ అవార్డ్ ఇచ్చి సత్కరించాలని అక్కినేని తన పేరుతో జాతీయ అవార్డ్ ప్రారంభించి తొలిసారిగా 2006లో బాలీవుడ్ నటుడు దేవానంద్‌కు ఇచ్చారు. ఏటా క్రమం తప్పకుండా అవార్డులు ఇవ్వడానికి టి.సుబ్బరామిరెడ్డి అధ్యక్షుడిగా రూ.కోటి మూలధనంతో అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.

నవ్వుతూ జీవించడం నాన్న నేర్పించారు

నాగార్జున

మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న 'కింగ్ ఆఫ్ ద సిల్వర్ స్ర్కీన్ ఫిల్మ్ ఫెస్టివల్'ను శుక్రవారం అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రారంభించారు అక్కినేని నాగార్జున. హెరిటేజ్ ఫౌండేషన్, ఎన్.ఎఫ్.డీ.సి. నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో 31 నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. 'దేవదాసు' చిత్రంతో ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నవ్వుతూ జీవించడాన్ని నాన్న మాకు నేర్పించారు. అందుకే ఆయన పేరు తలచుకుని నవ్వుతుంటాం. ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్న శివేంద్ర సింగ్ దుంగార్పూర్‌కు ధన్యవాదాలు. వాళ్లు సెలెక్ట్ చేసిన చిత్రాల ప్రింట్స్ చక్కని క్వాలిటీతో ఉన్నాయి. నార్త్‌లో ఈ ఫెస్టివల్‌కు మంచి స్పందన వస్తోందని శివేంద్ర చెప్పారు. నాన్నగారి శత జయంతి రోజున పోస్టల్ డిపార్ట్‌మెంట్ ప్రత్యేక స్టాంప్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి నాన్నగారి సీనియర్ అభిమానులు హైదరాబాద్ వచ్చారు. వారికి కూడా దన్యవాదాలు' అని చెప్పారు. వెంకట్ అక్కినేని మాట్లాడుతూ 'నాన్నగారి శత జయంతి రోజున ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. బాపుగారు గీసిన ఫొటోతో స్టాంప్ రూపొందింది. ఈ రోజే స్టాంప్ రిలీజ్ అయ్యేలా ప్లాన్ చేసిన కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు' అన్నారు. కేంద్రసమాచార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ 'నవంబర్‌లో గోవాలో నిర్వహించే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అక్కినేని చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొన్నారు.





కె.బాలచందర్ స్త్రీలోలుడు


\- గాయని సుచిత్ర





తమిళ దర్శక శిఖరం కె.బాలచందర్ ఓ స్త్రీలోలుడు అని గాయని, నటి సుచిత్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన జీవించివున్నంతకాలం కామవాంఛతో రగిలిపోయారంటూ ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కె.బాలచందర్ చనిపోయేంత వరకు ఒక 'లస్టీమేన్'గా ఉన్నారు. మహిళలను తప్పుడు దృష్టికోణంలోనే చూశారు. వారిపట్ల అసభ్యంగా నడుచుకున్నారు. ఆయన గురించి అనేక మందికి తెలుసు. నన్ను కూడా కొందరు ఫామ్‌హౌస్‌లకు రమ్మని పిలిచారు. కానీ, నేను వెళ్ళలేదు' అని చెప్పారు. ఆమె ఆరోపణలను తమిళ చిత్ర దర్శకుల సంఘం, దక్షిణ భారత సినీ రచయితల సంఘం తీవ్రంగా ఖండించాయి. తమిళ చిత్రపరిశ్రమకు ఎంతో మేలు చేసి, అనేక అవార్డులు అందుకుని, అనేకమంది యువ దర్శకులకు మార్గనిర్దేశం చేసిన కె.బాలచందర్‌ను ఉద్దేశించి సుచిత్ర చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, కోలీవుడ్ సినీ దర్శకుడు సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ విడుదల చేసిన ప్రకటనలో, ' భౌతికంగా మన మధ్యలేని గొప్ప వ్యక్తి గురించి ఇలా మాట్లాడి, వారి కుటుంబ సభ్యులను మనోవేదనకు గురిచేయడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

\- చెన్నై (ఆంధ్రజ్యోతి)



మళ్లీ కెమెరా ముందుకు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్‌కల్యాణ్ గతంలో తాను అంగీకరించిన చిత్రాలను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రం మొదటి భాగంలో మిగిలిన షూటింగ్ చేయడానికి సమయం కేటాయించారు. ఈ నెల 23 నుంచి విజయవాడలో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలవుతుంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ నిక్ పావెల్ సారథ్యంలో భారీ యుద్ధ సన్నివేశం చిత్రీకరించనున్నట్లు నిర్మాత దయాకరరావు చెప్పారు. ఇంతకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఈ యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించడానికి దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఎం.రత్నం ఈ సినిమాకు సమర్పకుడు.

ఓటుకు నోటు కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి!

- కేసు దర్యాప్తులో జోక్యం వద్దని రేవంత్‌కు ఆదేశం
- క్షమాపణలను అంగీకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎంకు నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. రేవంత్‌రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పారని రోహత్గీ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని కోర్టు మరోసారి హితవు పలికింది. ప్రజాస్వామ్యంలోని 3 కీలక వ్యవస్థలు తమ పరిధిలోని రాజ్యాంగ విధులను నిర్వర్తించాలని సూచించింది.

టిడ్కో సముదాయాలు ఇక 'ఎన్టీఆర్ నగర్'లు

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టిడ్కో ఇళ్ల కాలనీలకు ఇక నుంచి పీఎంఏవై-ఎన్టీఆర్ నగరాలుగా పేరు మార్చనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత వాటికి వైఎస్ఆర్ జగనన్న నగరాలుగా పేరు పెడుతూ అప్పట్లో మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఈ కాలనీలకు ఎన్టీఆర్ నగర్‌లుగా మార్చారు.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్

- రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- దురుద్దేశంతోనే బాలికను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడు
- చేరిన నెలలోపే ముంబైకి తీసుకెళ్లి అత్యాచారం
- రిమాండ్ రిపోర్టులో వెల్లడి



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబర్ 3 వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి అక్కడ వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందని తెలిపారు. 2019, డిసెంబర్ 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్ హిట్ సినిమాకు పనిచేశారని పేర్కొన్నారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబై వెళ్లారని.. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియ పెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 ఏళ్లని తెలిపారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానంటూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోయిందన్నారు. చెప్పినట్టు వినకుంటే షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆమెపై ఒత్తిడి కూడా తెచ్చేవాడని వెల్లడించారు. రోజురోజుకూ అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని, ఏదో పార్సిల్ పంపి భయపెట్టాలని చూశారని పోలీసులు పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి బాధితురాలు.. జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్‌కు చెప్పుకొందని, అతని సూచన మేరకే పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యులు విధుల్లో చేరాలి: కమిషనర్

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సేవలు నిత్యావసర, అత్యవసరమైనవి అయినందున పీహెచ్‌సీ వైద్యులంతా వెంటనే విధుల్లో చేరాలని ఆరోగ్యశాఖ కమిషనర్ పి.హరికిరణ్ కోరారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యులకు, డా.యూనస్‌కు ఆయన లేఖ రాశారు. ఇన్‌సర్వీస్ రిజర్వేషన్‌కు సంబంధించి పీహెచ్‌సీ డాక్టర్లు తమ ఆందోళనలను తిరిగి ప్రారంభిస్తారంటూ పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.యూనస్ మీర్ ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు లేఖ అందించారు. దానిపై స్పందించిన ఆరోగ్య శాఖ కమిషనర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధుల్లో చేరాలని తిరిగి లేఖ రాశారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు తన లేఖలో వాడిన భాష, ఆందోళన కార్యక్రమాల కొనసాగింపు ప్రతిపాదన ఈనెల 18న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్నారు.

ఒకేరోజు 1.03కోట్ల పుస్తకాల పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను ఒకేరోజు పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. రెండో సెమిస్టర్‌కు సంబంధించిన 1.03కోట్ల పుస్తకాలను ఈనెల 30న పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే మండల పాయింట్లకు పుస్తకాలు చేరుకున్నాయని, 28లోగా పాఠశాలలకు చేరుకుంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. 30న పంపిణీ ఈ ప్రక్రియను ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు.

నాపై పరువు నష్టం కేసు కొట్టివేయండి

- హైకోర్టుకు జగన్... ఎల్లుండి విచారణ

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో మంత్రి నారాయణ తనపై వేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ వద్ద విచారణకు రానుంది. రాజధాని భూముల వ్యవహారంలో తన పరువుకు భంగం కలిగించేలా వార్త ప్రచురించారని పేర్కొంటూ 2018లో మంత్రి నారాయణ, విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో జగన్మోహన్‌రెడ్డి, తదితరులపై పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసులో కోర్టు పలుసార్లు సమన్లు జారీ చేసినా జగన్ వాటిని అందుకోలేదు. పాస్‌పోర్టు పునరుద్ధరణ నిమిత్తం ఎన్‌వోసీ కోసం ఇటీవల ఆయన విజయవాడ కోర్టును ఆశ్రయించగా, ఎన్‌వోసీ జారీకి షరతులు విధించింది. ఈ ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది. పరువునష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు జగన్‌కు తాజాగా సమన్లు ఇచ్చింది. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. దీంతో పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టును ఆశ్రయించారు.

విద్యార్థినులకు డైట్ చార్జీల పెంపు

కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాల, కలికిరి, కంచికర్ల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీల్లోని విద్యార్థినులకు డైట్ చార్జీలు పెంచుతూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రూ.1,400 నుంచి రూ.1,600కు పెంచింది.

నా ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసులో హైకోర్టుకు బాధిత మహిళ వెల్లడి
- కేసు కొట్టేయాలంటూ అఫిడవిట్.. తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు
- ఈ నెల 25న నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక వేధింపుల కేసులో శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకొంది. ఎమ్మెల్యే లైంగికంగా వేధించాడని కేసు పెట్టిన మహిళ స్వయంగా హైకోర్టు ముందు హాజరై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తాను చేసిన ఆరోపణలు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని న్యాయస్థానానికి నివేదించారు. ఈ మేరకు న్యాయవాదితో నోటరీ చేసిన అఫిడవిట్ దాఖలు చేశామని ఆమె తరపు న్యాయవాది జితేందర్ కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. న్యాయస్థానం సైతం ఫిర్యాదుదారును పిలిచి మాట్లాడగా వాస్తవాలను వివరిస్తూ అఫిడవిట్ వేశానని, ఆదిమూలంపై నమోదు చేసిన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఈ నెల 25న తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. అప్పటివరకు ఆదిమూలంపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనపై పలుమార్లు లైంగికదాడి చేసి, అత్యాచారానికి పాల్పడ్డారంటూ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ నుంచి సస్పెండ్ అయిన సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ఫిర్యాదుదారు నేరుగా కోర్టుకు హాజరయ్యారు. ఆదిమూలం తరపున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనపై కేసు నమోదులో పోలీసులు చట్ట నిబంధనలు అనుసరించలేదు. మహిళా పోలీసు అధికారిణి కేసు నమోదు చేయాల్సి ఉండగా, పురుష అధికారి కేసు పెట్టారు. ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవు. జూలై, ఆగస్టు నెలల్లో ఘటన జరిగితే సెప్టెంబరు 5న ఫిర్యాదు చేశారు. మూడో వ్యక్తి చేసిన ఒత్తిడితోనే మహిళ కేసు పెట్టింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలి' అని కోరారు. బాధిత మహిళ తరపున న్యాయవాది జితేందర్ వాదనలు వినిపిస్తూ... పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు అన్నీ అవాస్తవమేనని బాధితురాలు కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. దానిని పరిగణనలోకి తీసుకొని కేసును కొట్టివేయాలని కోరారు.

ముందస్తు బెయిలు మంజూరు చేయండి

- హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ముంబయి సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి కాంతి రాణా తాతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ ముందు విచారణకు రానుంది. ఆ పిటిషన్‌లో... 'తన ఆధార్ కార్డు, ఇతర డాక్యుమెంట్లను ఫోర్జరీ చేశారని, తప్పుడు క్రిమినల్ కేసు పెట్టి పోలీసుల చేత అరెస్ట్ చేయించి వేధించాడని కుక్కల విద్యాసాగర్‌పై సినీనటి కాదంబరి జత్వాని ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా కుక్కల విద్యాసాగర్, ఇతరులని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. ఫిర్యాదులో నాపై నిర్దిష్టంగా ఎలాంటి ఆరోపణలు లేవు. జత్వానిపై కేసు, ఇంటిలో సోదాలు, అరెస్టు వ్యవహారంలో చట్ట నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఇప్పటికే నన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. వ్యాజ్యం తేలేవరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలి' అని కాంతిరాణా తాతా కోరారు.

గ్రీన్ గ్రేస్ అక్రమాలపై చర్చకు సిద్ధం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 20: వైసీపీ నాయకుడు అంబటి మురళీకృష్ణ గ్రీన్ గ్రేస్ అక్రమ నిర్మాణాలపై చర్చకు ఎక్కడికి రమ్మన్నా తాను సిద్ధమేనని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పొన్నూరు పట్టణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ అక్రమ కట్టడాల విషయంలో తాను చేసిన ఆరోపణలకు సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. అంబటి మురళి ఏంచేసినా ఎదుర్కొవటానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని గుంటూరు పట్టణంలో కోట్లాది రూపాయల విలువ చేసే భజరంగ్ జూట్ మిల్లుకు సంబంధించిన 5.17 ఎకరాల భూమిని అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. భూ యజమానులను బెదిరించి తక్కువ ధరకు భూములు చేజిక్కించుకున్నారని ఆరోపించారు. 500 పైబడిన ఫ్లాట్లు ఉన్న ఈ నిర్మాణాల్లో ల్యాండ్ ఓనర్స్‌కు కేవలం 87 ఫ్లాట్లే ఇచ్చేలా అగ్రిమెంట్ జరిగిందన్నారు. భూమి డెవలప్‌మెంట్‌కు ఇస్తే ఫిఫ్టీ ఫిఫ్టీ దామాష ప్రకారం ఫ్లాట్లు దక్కుతాయని ప్రజలందరికీ తెలుసన్నారు. కేవలం అధికారాన్ని అడ్డంపెటుకుని ఈ ప్రాజెక్ట్‌ను చేజిక్కించుకున్నారని ధ్వజమెత్తారు. భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతులపై కూడా విచారణ జరపాలని కోరుతున్నామన్నారు. అధికారుల తప్పిదాలతో ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందన్నారు. తనకు తెలిసి నిర్మాణాలపై స్టాప్ ఆర్డర్ ఉన్నప్పటికీ నిర్మాణాలు కొనసాగించటం అనుమానాలకు తావిస్తుందన్నారు. అంబటి మురళి చూపిస్తున్న అనుమతులు ఒక టవర్‌కు సంబంధించేనన్ని, మిగిలిన నిర్మాణాలకు అనుమతులు లేవన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగులతో అడ్డగోలుగా సంతకాలు పెట్టించుకున్నట్లు స్పష్టం అవుతుందన్నారు. గ్రీన్ గ్రేస్ అక్రమ నిర్మాణాలను నిరూపించటానికి తాను సిద్ధంగా ఉన్నానని నరేంద్ర కుమార్ సవాల్ విసిరారు. తనవి రాజకీయ ఆరోపణలు కావని, 500 పైబడిన వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా పోరాడుతున్నట్లు నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు.


మిర్చియార్డుకు ఎన్టీఆర్ పేరును విస్మరించారు

● వైసీపీ పాలనలో తొలగింపు
● తక్ పట్టీ పుస్తకాలపై అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ పేరు మాత్రమే ముద్రణ

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్టీఆర్ చేసిన సేవలకు గుర్తింపుగా మిర్చియార్డుకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీనందమూరి తారక రామారావు మార్కెట్ యార్డు, గుంటూరు అని పేరు మార్చగా వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని అమలు చేయలేదు. ఎన్టీఆర్ పేరు ఎక్కడా పరిపాలన వ్యవహారాల్లో కనిపించకుండా చేశారు. రైతు, కమీషన్ ఏజెంట్ అమ్మకం (తక్ పట్టీ) పుస్తకాలపై కేవలం అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుంటూరు అని మాత్రమే ముద్రించి పంపిణీ చేశారు. దీనిపై ఎన్టీఆర్ అభిమానులు ప్రశ్నించినా మిర్చియార్డు యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రికార్డులలో ఒక పేరు, తక్ పట్టీ పుస్తకాలపై మరో పేరు ఉన్న నేపథ్యంలో జీఎస్టీ అధికారులు పట్టుకుంటే తమకు ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాపారస్థులు వాపోతున్నారు.

2017లో జీవో జారీ..

2017 ఏప్రిల్ 19వ తేదీ వరకు మిర్చియార్డు పేరు అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుంటూరు అని ఉండేది. అప్పటి యార్డు పాలకవర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఎన్టీఆర్ పేరుని చేర్చాలని ప్రతిపాదించగా మార్కెటింగ్ శాఖ ఆమోదం తెలిపి జీవో ఆర్‌టీ నంబరు. 243ని ఆ ఏడాది ఏప్రిల్ 20న జారీ చేసింది. దాని ప్రకారం ఆ రోజు నుంచే శ్రీనందమూరి తారక రామారావు మార్కెట్ యార్డు, గుంటూరుగా రికార్డులలో మారిపోయింది.



ఎన్టీఆర్ పేరు లేకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీ ముద్రించిన తక్ పట్టీ పుస్తకాలు

అప్పట్లో యార్డు ముఖద్వారం వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అలానే పరిపాలన వ్యవహారాల్లోనూ ఈ పేరునే వినియోగించేవారు. ఎప్పుడైతే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేసిందో అప్పటి నుంచి ఎన్టీఆర్ పేరుని తొలగించేసింది. ఎన్టీఆర్ పేరు ఎక్కడా కనపడకూడదన్నట్లుగా ఆఖరికి బిల్లు పుస్తకాలపైనా తీసేసింది.

వినియోగంలో మార్చేశారు..

నేటికీ మిర్చియార్డుకు ఎన్టీఆర్ పేరుతో జారీ చేసిన ఉత్తర్వులు యథాతథంగా అమల్లో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎలాంటి సవరణ ఉత్తర్వులు కూడా విడుదల కాలేదు. అయినప్పటికీ వినియోగంలో పేరు మార్చేశారు. ఇప్పటి వరకు జీఎస్టీ అధికారులు ఎలాంటి అభ్యంతరం పెట్టకపోవడం వలన మిర్చి లావాదేవీలు సాఫీగా సాగిపోతున్నాయి. లేకుంటే పరిపాలన పరంగా తాము ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చేదని వ్యాపారస్థులు చెబుతున్నారు. ఇకనైనా జీవో ప్రకారం ఎన్టీఆర్ పేరుని అన్ని స్థాయిల్లో అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన ద్రోహులను కఠినంగా శిక్షించాలి

దుగ్గిరాల, సెప్టెంబరు 20: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా పవిత్ర తిరుమల లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసిన ద్రోహులను కఠినంగా శిక్షించాలని దుగ్గిరాల గ్రామ తెదేపా నాయకులు పేర్కొన్నారు. తిరుమలలో జరిగిన అపవిత్ర కార్యక్రమాలకు గత వైసీపీ ప్రభుత్వమే కారణమని పేర్కొంటూ మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దిష్టిబొమ్మలను శుక్రవారం దహనం చేశారు. మండలకేంద్రం దుగ్గిరాలలోని శివాలయం సెంటర్లో జరిగిన దిష్టిబొమ్మల దహనం సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన బాధ్యులందరిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, టీటీడీ ధార్మిక మండలి సభ్యులు చుండూరు ఉమామహేశ్వరరావు, పసుపులేటి గణేష్ మాట్లాడుతూ కలియుగదైవం వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిని ఉరి తీయడమే సమంజసం అన్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు



దుగ్గిరాల శివాలయం సెంటర్లో మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి దిష్టిబొమ్మల దహనంలో కూటమి నాయకులు

దేవరపల్లి చంటి, నక్కా చిరంజీవి, పసుపులేటి రవియాదవ్, దోస్త్ సభ్యులు గద్దె శ్రీనివాస్, నూకతోటి రవి, పేర్లి వంశీ, లాలూ నాయక్, లక్ష్మానాయక్, చింతమనేని మహేష్, నవీన్ గౌడ్, వీరంకి నాగేశ్వరరావు, ప్రసాద్, లియాఖత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్‌టాప్ శాస్త్రవేత్తల్లో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 20: చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆరుగురు అధ్యాపకులు వరల్డ్ టాప్ శాస్త్రవేత్తల్లో చోటు సాధించారని వీసీ ఆచార్య పి.నాగభూషణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతంలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఈ మేరకు నిర్వహించిన సర్వేలో తమ అధ్యాపకులు 2శాతం మంది ఉన్నారని వివరించారు. విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీకి చెందిన ఆచార్య అంబటి రంగారావు, డాక్టర్ కె.చంద్రశేఖర్, మెకానికల్ విభాగానికి చెందిన ఆచార్య కె.వెంకటరావు, ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ రుద్రపాల్ మిథున్, అడ్వాన్స్ సీఎస్ఈ విభాగానికి చెందిన డాక్టర్ జ్యోత్స్నాదేవి, కెమికల్ విభాగానికి చెందిన ఆచార్య టి.సుబ్బయ్య తదితరులు ఉన్నారని తెలిపారు. అధ్యాపకులకు సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అభినందించారు.



అధ్యాపకుల్ని అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

వయోవృద్ధులకు అవసరమైన పరికరాలు అందజేయాలి

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశంలో జేసీ భార్గవ్ తేజ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 20: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వయోవృద్ధులకు అవసరమైన పరికరాలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ రెవిన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వయోవృద్ధులకు అవసరమైన వీల్ చైర్స్, హియరింగ్ మెషిన్లు, చేతికర్రలు త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు. అన్ని వృద్ధాశ్రమాలు తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో ఇంటర్, ఆపై తరగతులు చదువుతున్న విద్యార్థులను జాయిన్ చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైల్వే డీఎస్పీగా అక్కేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



గుంటూరు, సెప్టెంబరు 20: గుంటూరు రైల్వే డీఎస్పీగా పి.అక్కేశ్వరరావును నియమించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గుంటూరు రైల్వే స్టేషన్‌లోని జీఆర్‌పి స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో సీఐగా ఆయన ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో పనిచేశారు నగరంలో ట్రాఫిక్ సీఐగా కూడా కొంతకాలం విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ అక్కేశ్వరరావును ఆర్పి ఎస్ఐలు రమేష్ (గుంటూరు), వెంకటాద్రి (తెనాలి), సరస్వతి (బాపట్ల), సుబ్బారావు (నరసరావుపేట), శ్రీనివాసరావు నాయక్ (నడికుడి), ఆర్‌పిఎఫ్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

పొలాల్లో జంట ఆత్మహత్యాయత్నం

● మహిళ మృతి, పురుషుడి పరిస్థితి విషమం

చేబ్రోలు, సెప్టెంబరు 20: నారాకోడూరు శివారులోని పంట పొలాల్లో గుర్తుతెలియని జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం నారాకోడూరు శివారు పంట పొలాల్లో పురుషుడు, మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని స్థానికులు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సరికి మహిళ మృతి చెందింది. పురుషుడి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వారి వివరాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు ఆర్థిక చేయూత



చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు అంజేస్తున్న డాక్టర్ నెల్లూరి రమేష్, పూనాటి శ్రీనివాసరావు

నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విరాళం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20: వరద బాధితులకు నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక చేయూతనిచ్చారు. గురువారం ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్ చేతుల మీదగా రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందించిన అసోసియేషన్ సభ్యులను నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. లారీ యజమానులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న నసీర్ అహమద్, లారీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



మంత్రి నారా లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ప్రియదర్శినీ విద్యాసంస్థల సిబ్బంది

ప్రియదర్శినీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో..

దుగ్గిరాల, సెప్టెంబరు 20: వరద బాధితుల సహాయార్థం దుగ్గిరాల మండలం, చింతలపూడిలోని ప్రియదర్శినీ విద్యాసంస్థల సిబ్బంది ఒక రోజు వేతనం రూ.2లక్షల చెక్కును రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి శుక్రవారం అందించారు. చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతృత్వాన్ని చాటుకున్న పమిడిపాడు..

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20: వరద బాధితులను ఆదుకునేందుకు నరసరావుపేట మండలం పమిడిపాడు ప్రజలు కుల, మత, పార్టీలకు అతీతంగా స్పందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ నెల్లూరి రమేష్ బాబు సంకల్పించగా, రొంపిచర్ల ఆంజనేయులు ప్రోత్సాహంతో పూనాటి శ్రీనివాసరావు, నలమాల పూర్ణచంద్రరావు, నలమాల బాజీ, పోపూరి శ్రీను, జుజ్జూరి సాంబయ్య, సహకారంతో రూ.5 లక్షలు సేకరించారు. రూ.5 లక్షల చెక్కును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వెలగపూడి సచివాలయంలో కలిసి ఇచ్చామని పూనాటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పమిడిపాడు ప్రజలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు వీఐటీకి గవర్నర్ రాక

తుళ్లూరు, సెప్టెంబరు 20: మండల పరిధిలోని ఐనోలు రెవెన్యూలో ఉన్న వీఐటీ -ఏపీ అమరావతి విశ్వవిద్యాలయానికి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం రానున్నారు. వీఐటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వీఐటీ యాజమాన్య ఆహ్వానం మేరకు ఉదయం 10 గంటలకు హాజరు కానున్నారు. సభలో ఆయన ప్రసంగిస్తారు.

సీబీఐ ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా శ్రావణ్ కుమార్



గుంటూరు (లీగల్), సెప్టెంబరు 20: గుంటూరుకు చెందిన సీనియర్ న్యాయవాది మన్నవ శ్రావణ్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సీబీఐకి సంబంధించిన కేసులను విచారించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర హైకోర్టులో ఇప్పటి వరకు ఆ శాఖకు సంబంధించిన పెండింగ్ కేసుల విషయమై చర్చించేందుకుగానూ వెంటనే విశాఖపట్నం కార్యాలయానికి రావాల్సిందిగా ఆయనకు ఆదేశాలు జారీ చేశారు. శ్రావణ్ కుమార్ గుంటూరు కేంద్రంగా గత 3 దశాబ్దాలకుపైగా సీనియర్ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. పలు బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలకు న్యాయ సలహాదారుగా పనిచేస్తున్నారు.

విజయవాడ మార్గంలో పలు రైళ్ల రద్దు

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెయిన్‌టెనెన్స్ వర్కులు కారణంగా విజయవాడ మార్గంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన నంబరు 22708 తిరుపతి - విశాఖపట్నం, 30న నంబరు 22707 విశాఖపట్నం - తిరుపతి, నంబరు 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, నంబరు 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 29, 30 తేదీల్లో నంబరు 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి, ఈ నెల 30, అక్టోబరు 1వ తేదీల్లో నంబరు 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు తెలిపారు.

జాతీయ క్యారమ్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20: విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ క్యారమ్స్ పోటీల్లో జిల్లాకు చెందిన బీనవ్య, జీ.ముయాఖలు వరుసగా బంగారు, రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర క్యారమ్ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నీరజ్‌కుమార్, షేక్ అబ్దుల్ జలీల్, సంఘ చీఫ్ ప్యాట్రన్ యాంగటి దుర్గారావులు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 26 వరకు గ్వాలియర్‌లో జరిగే 49వ జాతీయ క్యారమ్స్ పోటీల్లో వీళ్లిద్దరూ ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అబ్దుల్ జలీల్

25 నుంచి అండర్ -19 విద్యార్థుల క్రీడా పోటీల ఎంపికలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 20: జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు క్రీడా పోటీల ఎంపిక ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్ సమాఖ్య కార్యదర్శి జీ. నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 26న రగ్బీ, సెపక్ టక్ర ఎంపికలు జడ్పీ స్కూల్ నందిగామ (సత్తెనపల్లి రూరల్)లో, 27న ఖోఖో ఎంపికలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల(అమరావతి)లో జరుగుతాయని పేర్కొన్నారు. ఆయా ఎంపికల్లో పాల్గొనే విద్యార్థినీవిద్యార్థులు 2006 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలని, ప్రిన్సిపల్ సంతకం చేసిన పది మార్కుల జాబితా జిరాక్స్ తప్పనిసరిగా తీసుకుని పోటీలకు హాజరుకావాలని ఈ సందర్భంగా సూచించారు.

క్వారీ గుంతలో పడి బాలుడు మృతి

తుళ్లూరు, సెప్టెంబరు 20: అనంతవరంలో బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అనంతవరం కొండ వెనక క్వారీ గుంతలో పడి కొర్రా అనిల్ (16) మృతి చెందాడు. మధ్యాహ్నం గేదెలను తోలుకొని వెళ్లాడు. నీటి క్వారీ గుంతలో అవి దిగటంతో బాలుడు కూడా అందులో దిగాడు. లోతులోకి వెళ్లి మృతి చెందాడు. స్థానిక పాఠశాలలో 9వ తరగతి అనిల్ చదువుకుంటున్నాడు. తండ్రి శ్రీనివాసరావుకు ఒక్కడే కుమారుడు. సంఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 14,400 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 20: ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 29వేల క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు మేర ఎత్తి 14,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 14,605 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 20: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,633 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5510 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27,973 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 46,516 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,516 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 20 : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 28,792 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 33,640 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారాను, మిగిలినవి ఒక గేటు ద్వారా దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

49,041 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 43,733 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,041 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,151 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000
నెంబరు. 5	14500	15500
273	11200	11200
341	8800	11500
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500
బ్యాడిగి	9000	14500
దేవనూరు డీలక్స్	9500	15500
తెల్లకాయలు	5000	11500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	16000
నెంబరు. 5	--	--
273	12500	12500
341	10000	17000
4884	13000	13000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	18600
బ్యాడిగి	11000	11000
దేవనూరు డీలక్స్	9000	16500
తెల్లకాయలు	6000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల గురజాల సత్తెనపల్లి పెదకూరపాడు



మాచర్లలో వంద రోజుల పాలన కరపత్రాలను విడుదల చేస్తున్న కూటమి నేతలు

రాష్ట్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి

● 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కూటమి నేతలు

మాచర్లటౌన్, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రగతికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని కూటమి నేతలు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ100 రోజుల పాలన ముగిసిన సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు అధ్యక్షతన పట్టణంలోని 22వ వార్డులో కూటమి నేతలు గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, వజ్రం నాయక్, సూరె యలమంద, కొమెర శివ, మాచర్ల వాసు, ఓర్సు క్రాంతికుమార్, పోకూరి కాశీపతి, స్పెషలాఫీసర్ గబ్రూనాయక్, లాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: మండలంలోని విజయపురిసౌత్‌లో కూటమి నేతలు వంద రోజుల ప్రభుత్వ పాలనపై కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఎన్ బసివిరెడ్డి, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, మైలపల్లి అప్పల రాజు, సత్తిబాబు, పరమేశ్వరరావు, జనసేన అధ్యక్షుడు రాహుల్, గంటా ధనుంజయరావు, ఎరుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల : మండల పరిషత్ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను ఎంపీడీవో వై.మహాలక్ష్మి విడుదల చేశారు. అధికారులు, కూటమి నేతలు ఇంటింటికి వెళ్లి 100 రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, టీడీపీ నేతలు ఎస్.శ్రీనివాసరావు, ఎం.రాజారెడ్డి, జీ.సుమంత్‌రెడ్డి, పెదబాబు, బీ.రామకృష్ణ, రాజ్‌కుమార్, రాయపరెడ్డి, ఇన్నారెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ వందరోజుల పాలనపై ఎంపీపీ యేచూరి సునీతా సాయిశంకర్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 24న ముటుకూరులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని మండాదిలో కూటమి నేతలు, అధికారులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వంద రోజులపాలనపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ జగదీశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నేతలు గుజ్జుల పాపిరెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారంపూడి : కారంపూడిలో కూటమి నేతలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం-1లో వంద రోజుల పాలనపై కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్ జాని, కాపు సంఘ నేత జక్కా నరసింహారావు, పలిశెట్టి కొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని నరమాలపాడు, ఒప్పిచర్ల గ్రామాల్లోనూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో దోర్నాల బ్రహ్మారెడ్డి, ఆశం నరసింహారెడ్డి, గాడిపర్తి ఆంజనేయులు, పాశం శ్రీనివాసరావు, పెద శ్రీనివాసరావు, రాంబాబు, ఆంజనేయులు, బొజ్జయ్య, బద్రి, జనార్ధన్, చిన ఆంజనేయులు, నాగ శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను విచారించిన ఎంఈవో

దాచేపల్లి, సెప్టెంబరు 20: ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్య పోరుతో పాఠశాలలో విద్యార్థుల చదువు వెనుకబడిందన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులతో శుక్రవారం వివిధ పత్రికల్లో వచ్చిన సమాచారం ఆధారంగా దాచేపల్లి ఎంఈవో పినాకపాణి దాచేపల్లి నగర పంచాయతీలోని ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను విచారించారు. హెచ్ఎం శివయ్య, ఉపాధ్యాయులు సురేఖ, రాము, వెంకటరమణ, తదితర ఉపాధ్యాయులను విచారించి పాఠశాల విద్యార్థులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఐక్యంగా వుండాలని, హెచ్ఎం చెప్పిన విధంగా పాఠశాలను నడుపుకోవాలని సూచించారు. పాఠశాలలో జరుగుతున్న వివాదంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎంఈవో స్పష్టం చేశారు.

ఒకే పోలింగ్‌బూత్‌లో

కుటుంబ సభ్యుల ఓట్లు

మాచర్లటౌన్, సెప్టెంబరు 20: కుటుంబసభ్యుల ఓట్లు మొత్తం ఒకే పోలింగ్ బూత్‌లో ఉండాలని, అలా లేకుండా అధికారుల దృష్టికి తీసుకొస్తే ఒకే బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గంలోని అధికారులు, రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జియావుల్ హక్ మాట్లాడుతూ ఇంటింటికి ఓటరు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కారంపూడి తహసీల్దారు ప్రసాద్, దుర్గి తహసీల్దారు ఫణీంద్ర, ఎలక్షన్ డీటీ బాషా, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, టీడీపీ, బీఎస్పీకాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

నీటి శుద్ధీకరణపై అవగాహన

పిడుగురాళ్ల, సెప్టెంబరు 20: పిడుగురాళ్ల గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో ఏఈ అలెక్స్ చిన అగ్రహారం, మంగాపురం క్యాంపులో నీటి శుద్ధీకరణ, వాడకం పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ట్యాంక్ నీటిని కాచి చల్లార్చి వాడుకోవాలని, సూచించారు. మంగాపురం క్యాంపుకు చెందిన తమ్మినేడి ఆదిలక్ష్మీ క్లోరినేషన్‌పై ఢిల్లీ వేదికగా సెమినార్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించిందని ఏఈ అలెక్స్ తెలిపారు.

స్వచ్ఛతాహి సేవపై

కళా బృందం ప్రదర్శన

సత్తెనపల్లి, సెప్టెంబరు 20 : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశానుసారం సత్తెనపల్లి పట్టణంలో శుక్రవారం కళాజాత బృందం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించింది. ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని కళా బృందం సభ్యులు ప్రదర్శన ద్వారా వివరించారు. కళా భారతి కల్చరల్ బృందం సభ్యులు ఎం శ్రీశైలం, శివ, గుంటూరు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో .. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షమ్మి, ప్రిన్సిపాల్ యూ కోటేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కమిషనర్ షమ్మి, అధ్యాపకులు

ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం



పిన్నెల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా

● అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి పాలన
● శరవేగంగా రాజధాని, పోలవరం పనులు
● శ్రీవారి లడ్డుని కలుషితంచేసి రాష్ట్రాన్ని అబాసుపాల్జేసిన వైసీపీ
● 'ఇది మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని
● ఎమ్మెల్సీ జంగాతో కలసి పిన్నెల్లిలో పర్యటన

మాచవరం, సెప్టెంబరు 20: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్ర వారం మండలంలోని పిన్నెల్లి గ్రామంలో 'ఇది మంచిప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగాలు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నెరవేర్చిన హామీలను గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. 100 రోజుల కూటమి ప్రభుత్వ పరిపాలనలో సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయటమే కాక, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారన్నారు. కేంద్రం నుంచి రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణానికి నిధులను సాధించినట్లు తెలిపారు. వైసీపీప్రభుత్వం తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీని కలుషితం చేసి రాష్ట్రాన్ని అభాసుపాలు చేసిందని మండిపడ్డారు. వైసీపీ నేతలు పిన్నెల్లి గ్రామాన్ని రావణ కాష్టంలా మార్చి హత్యలు, మానభంగాలు, ఆస్తుల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడితే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం గ్రామస్థులకు అన్నివిధాలా అండగా ఉంటూ, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రశాంత వాతావరణాన్ని సృష్టిం చిందన్నారు. తాము ఎప్పుడూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డామే గానీ అన్యాయాలు చేయలేదని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాత్రం వైసీపీ శ్రేణుల అక్రమాలకు, దురాగతాలకు ఊతంగా నిలుస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ అంకారావు, మండల టీడీపీ అధ్యక్షుడు బడిగుంచల వెంకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దున్నా చెన్నయ్య చౌదరి, యడ్లపల్లిరామారావు, కొల్లి కృష్ణమూర్తి, పసులూరి రామయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు, టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాలను ప్రారంభించారు.

గురజాల: గురజాల పట్టణంలో కూటమి నేతలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ఇంటింటికి తిరిగి 100 రోజుల పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని పల్లెగుంత, గంగవరం గ్రామాల్లోనూ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను, కొట్టే శ్రీను, మాజీ ఎంపీటీసీ హనుమంతురావు, బడిదెల శ్రీనివాసరావు, జాస్తి ప్రకాష్, నెల్లూరి మల్లయ్య, జక్కా అంకారావు, పోటు నాగేశ్వరరావు, మరియబాబు, ఎంపీడీవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామంలో తహసీల్దార్ కుటుంబరావు, అధికారులు పలువురు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శరత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో కూటమి నేతలు, గ్రామ, వార్డుకు చెందిన నేతలు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రతి ఇంటికి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొమ్మినేని రామచంద్రరావు, పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గురజాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కూటమి నేతలు

ప్రజలు మెచ్చిన 'మంచి ప్రభుత్వం'



ఇరుకుపాలెంలో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

● సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● ప్రజాభిప్రాయాన్ని సేకరించాలి : కలెక్టర్
● వివిధ ప్రాంతాల్లో సభలు, పాల్గొన్న కూటమి నేతలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 20 : వంద రోజుల పాలనలో 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రజలచేత కూటమి ప్రభుత్వం అనిపించుకుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ముప్పాళ్ళ మండలం ఇరుకుంపాలెంలో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కన్నా మాట్లాడుతూ సంక్షోభంలోను సంక్షోభాలను అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీటవేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కేవలం వంద రోజుల్లో అన్నివర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందటంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల కృషి ఎంతో ఉందన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధిగా ప్రతి ఇంటికి వెళ్ళి పాలన, రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్నారు. ముందుగా గ్రామంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను కన్నా ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గృహాలకు అంటించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, బత్తుల నాగేశ్వరరావు, దరువూరి సుజాత, దరువూరి శ్రీనివాసరావు, బత్తుల రామకృష్ణ, గోగినేని కోటేశ్వరరావు, మొక్కపాటి రామచంద్రరరావు, దరువూరి నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, నానయ్య, పూజల వెంకట కోటయ్య, కట్టా రమేష్, కొండ్రకుంట రంగారావు, తహసీల్దార్ భవానీ శంకర్, ముప్పాళ్ళ మండలానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి పట్టణంలోని పలువార్డుల్లో టీడీపీ నేతలు, అధికారులు వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షమ్మి, టీడీపీ నేతలు యెల్లినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ : కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం, ప్రజలకు మంచి చేసే ప్రభుత్వమని సర్పంచ్‌లు ఈదర రామారావు, పుట్టా శివపార్వతిలు అన్నారు. మండలంలోని భట్లూరు, గుజ్జర్లపూడి, పాకాలపాడు గ్రామాల్లో ఇది మంచిప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, టీడీపీ నేతలు యతీష్, నన్నేసాహెబ్, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: రాజుపాలెం గ్రామంలో మండల ప్రత్యేక అధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఇది మంచి ప్రభుత్వం గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు ప్రభుత్వం వంద రోజల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, ఎంఈవో మల్లికార్జున శర్మ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నకరికల్లు: మండలంలోని అన్ని గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని అధికారులు కూటమి నేతలతో కలసి ఇంటింటికి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా లీగల్‌సెల్ నేత షేక్ ఆలీబాషా, ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ చేజర్ల ప్రత్యూష, టీడీపీ నేతలు తిరుమలశెట్టి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రేపు మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి, సెప్టెంబరు 20 : సత్తెనపల్లి పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా స్వయంగా కంపెనీలతో మాట్లాడి ఈ మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభ మవుతుందని, నియోజకవర్గంలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నా కోరారు.

బీసీ రిజర్వేషన్ ఆమోదంపై హర్షం

దాచేపల్లి, సెప్టెంబరు 20: మన దేశ రాజకీయ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా బీసీలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంపై టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కినపల్లి బాలయ్య హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వివిధ బీసీ సంఘాల నేతలతో దాచేపల్లి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించేందుకు కృషిచేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘ నేతలు గుంటుపల్లి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు నాగరాజు, వేముల కృష్ణ, శ్రీరామదాసు ఆంజనేయులు, గుంజా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బేకరి షాపు దగ్ధం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 20: విద్యుదాఘాతంతో బేకరి షాపు దగ్ధమైన ఘటన మండలంలోని విజయపురిసౌత్‌లో జరిగింది. విజయపురిసౌత్‌లోని అంబేద్కర్ సెంటరు వద్ద పెద్దవరపు సైదులు అనే వ్యక్తి బేకరి షాపును నిర్వహిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. ఫైర్ ఇంజన్ వచ్చేసరికే షాపు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు సైదులు తెలిపాడు.

చుక్కల, అసైన్డ్ భూముల రికార్డుల పరిశీలన

అచ్చంపేట, సెప్టెంబరు 20 : అచ్చంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్ కుమోదిని సింగ్ అసైన్డ్, చుక్కల భూముల రికార్డులను పరిశీలించారు. గింజుపల్లి, చల్ల గరిగ, పెదపాలెం, ఓర్వకల్లు గ్రామాల్లోని భూముల రికార్డులను తనిఖీ చేశారు. ఆమెతోపాటు తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థిపై వీధి కుక్కల దాడి

దాచేపల్లి, సెప్టెంబరు 20: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి గ్రామం, జంగాల కాలనీలో 2వ తరగతి విద్యార్థి తేజ శుక్రవారం పాఠశాలకు వెళుతుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడి చేయి, కాలు, వీపు భాగంలో కుక్కలు కరిచాయి. వెంటనే దగ్గరలోవున్న స్థానికులు రాళ్ళ, కర్రలతో కుక్కలను చెదరగొట్టి కిందపడిన తేజను రక్షించారు. వెంటనే ప్రథమ చికిత్స నిర్వహించి హాస్పటల్‌కు తరలించారు. కుక్కల బారి నుంచి తమను కాపాడాలని స్థానికులు మున్సిపల్ అధికారులను వేడుకున్నారు.

సీఐ బ్రహ్మయ్యకు రివార్డు

సత్తెనపల్లి, సెప్టెంబరు 20 : సత్తెనపల్లి పట్టణ సీఐ బ్రహ్మయ్య శుక్రవారం పోలీసు ఉన్నతాధికారుల చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. పల్నాడు జిల్లా పోలీసు అధికారులతో గుంటూరు రేంజ్ ఐజీ ఎస్ త్రిపాఠి, ఎస్పీ కే.శ్రీనివాసరావులు నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన సీఐ బ్రహ్మయ్యకు ఎస్పీ రివార్డును అందించారు.

పట్టణ ఎస్ఐగా సంధ్యారాణి

మాచర్లటౌన్, సెప్టెంబరు 20: మాచర్ల పట్టణ ఎస్ఐగా సంధ్యారాణి శ్రుకవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె దాచేపల్లిలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా మాచర్లకు వచ్చారు. ఈ ఎస్ఐ సంధ్యారాణిని సీఐ ప్రభాకరరావు అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

సంక్షోభంలోనూ సంక్షేమాన్ని వీడలేదు

● ఐదేళ్ల వైసీపీ పాలన అంతా అరాచకమే
● వంద రోజుల కూటమి ప్రభుత్వంతో ఎన్నో ప్రయోజనాలు

పెదకూరపాడు, సెప్టెంబరు 20: సంక్షోభ పరిస్థితుల్లోనూ సంక్షేమాన్ని వీడకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటినీ నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా వందరోజుల పాలనను పూర్తిచేసుకుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని కాశిపాడు, గారపాడు గ్రామాల్లో శుక్రవారం 'ఇది మంచిప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్టుగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంపై ఆధారాలతోనే సీఎం చంద్రబాబు మాట్లాడారని, వైవీ సుబ్బారెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కల్తీ జరగలేదని నిరూపించాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికా బద్ధంగా పాలన అందిస్తున్నామన్నారు. సూపర్ 6 అమల్లో భాగంగా దీపావళి పండుగ కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తారన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, పరుచూరి పూర్ణచంద్రరరావు, జనసేన మండల అధ్యక్షుడు మల్లెల చలపతిరావు, కూటమి నేతలు, సచివాలయాల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: మండల కేంద్రమైన బెల్లంకొండలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ జిల్లా అధికారిణి ఉషారాణి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, పంచాయతీ సెక్రటరీ గిరిధర్‌రెడ్డి, పీఎస్‌కేరసూల్ పాల్గొన్నారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో తహసీల్దార్ జే.మున్సీసాబేగం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.

క్రోసూరు: క్రోసూరులో ఎంపీడీవో బీ మహేష్‌బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు ఇంటింటికి 'ఇది మంచి ప్రభుత్వం' లోగోలను, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమాల పూర్ణ, యోహాన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



క్రోసూరులో ఇది మంచి ప్రభుత్వంలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

అచ్చంపేట: మండలంలోని కోనూరు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదంతో పాటు టీడీపీ నేతలు, అధికారులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి బత్తుల శివయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ నరసింహారావు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రవీణ్‌తో మాట్లాడుతున్న ఉయ్యందన గ్రామ టీడీపీ, జనసేన నాయకులు

రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

● ఎమ్మెల్యేను కోరిన టీడీపీ, జనసేన నాయకులు

క్రోసూరు, సెప్టెంబరు 20 : గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని మండలంలోని ఉయ్యందన గ్రామానికి చెందిన టీడీపీ జనసేన నేతలు శుక్రవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో భాష్యం ప్రవీణ్‌ను కలిసి విన్నవించారు. అంతర్గత రహదారులు గతంలోనే అధ్వాన్నంగా ఉన్నాయని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయని, కొన్ని గ్రామాల మధ్య పాదాచారుల సైతం రాకపోకలు సాగించే పరిస్థితి లేదని ఆయన దృష్టికి తీసుకు వెళ్ళారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఏపూరి నాగేశ్వరరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ లేళ్ళ వెంకటరావు, జనసేన నియోజక వర్గ అధ్యక్షుడు యర్రంశెట్టి రామకృష్ణ, ఉయ్యందన సర్పంచ్ మంకు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పాల ఉత్పత్తిదారులకు

బోనస్ పంపిణీ

బెల్లంకొండ, సెప్టెంబరు 20 : మండల కేంద్రం బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు గంగిరెడ్డిపాలెం సంగం డెయిరీ మేనేజర్ శ్రీనివాసరావు, రెంటపాళ్ళ సంఘం డెయిరీ మేనేజర్ గోపీ బోనస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు బోనస్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నాగిరెడ్డిపాలెంలో 123 మంది సభ్యులకు రూ.2,47,064, బెల్లంకొండలో 120 మంది సభ్యులకు 1,92,369 పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు వెన్నా సీతారామిరెడ్డి, సంగం డెయిరీ సూపర్‌వైజర్ సాయి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళాకారుడు మృతి

సత్తెనపల్లి, సెప్టెంబరు 20 : పట్టణంలోని వడ్డవల్లికి చెందిన ప్రజా కళాకారుడు ఉన్నం నాగేశ్వరరావు(55) శుక్రవారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన ప్రజా కళా మండలి రాష్ట్ర నాయకుడిగా కొనసాగుతున్నారు. నాగేశ్వరరావు సత్తెనపల్లి కోర్టులో ప్లీడర్ గుమస్తాగా చేస్తున్నారు. ఈ సందర్భగా పలువురు నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

వినుకొండ టౌన్, సెప్టెంబరు 20: పట్టణ వీధుల్లో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటి ఆవరణలో దోమల నియంత్రణపై మహిళలకు వివరించి, అరికట్టేందుకు పలు రకాల సూచనలు చేశారు. అదేవిధంగా పట్టణంలో వార్డుల్లో వెలగని వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. గత ప్రభుత్వం హయాంలో పట్టణంలో పలు వార్డుల్లో కనీసం వీధిలైట్లుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచన మేరకు విజయవాడకు చెందిన టెక్నీషియన్లను పిలిపించి 80 వాట్స్, 40, 20 వాట్స్ లైట్స్ అన్నిటికీ మరమ్మతు చేయించారు. కేవలం రెండు రోజుల్లో అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాలలో ...

నరసరావుపేట టౌన్: స్థానిక జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యా సంస్థలలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని అన్నారు. కార్యక్రమం అక్టోబరు 2వరకు జరుగుతుందన్నారు. స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలని, పర్యావరణ స్థిరత్వానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ మహాత్మాగాంధీ వారసత్వాన్ని గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసరాలలో 100 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను విద్యార్థులు సేకరించి కాకాని పంచాయతీకి అందజేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టల వితరణ

● వినుకొండ: వినుకొండ పురపాలక సంఘంలోని చెత్తను తీసుకువెళ్లే ట్రాక్టర్లపై కప్పేందుకు రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో 7టార్పాలిన్ పట్టలను కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు శుక్రవారం అందచేశారు.

● ఈపూరు: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వలన పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని దాంతో ఆరోగ్యానికి భద్రత ఉంటుందని జిల్లా ఉద్యాన శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మండల కేంద్రమైన ఈపూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధిలో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, తహశీల్దారు నళిని, ఉద్యానశాఖాధికారి నవీన్, టీడీపీ నాయకులు బొల్లా సుబ్బారావు, డేవిడ్, పంచాయితీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరిస్తాం: డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 20: ఆశా కార్యకర్తల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆశ కార్యకర్తలతో వారి సమస్యలపై సమావేశం నిర్వహించవలసిందిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారన్నారు. ఆ మేరకు శుక్రవారం పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ బి రవి అధ్యక్షతన ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో 15 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎం.సురేష్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు పేదలకు చేసింది ఏమీ లేదు

● సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలరావు

వినుకొండ, సెప్టెంబరు 20: వికసిత్ భారత్ అంటూ మోడీ, మాది మంచి ప్రభుత్వం అంటూ చంద్రబాబు ప్రచారాలు తప్ప పేదలకు చేసింది ఏమీ లేదని సీపీఎం పల్నాడు జిల్లా కార్యకర్గ సభ్యులు గోపాలరావు అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయం ఆవరణలో సీపీఎం పార్టీ జాతీయ్య కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశప్రజల అభివృద్ధికోసం ఎటువంటి ప్రయత్నాలు చేయటంలేదని విమర్శించారు. కార్యక్రమంలో రామకృష్ణ, హనుమంతరెడ్డి, బొంకూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వానికి విశేష స్పందన

వినుకొండ, సెప్టెంబరు 5: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్‌లో పట్టణ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ సభ్యుత్వ నమోదు శిబిరం శుక్రవారం ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు పోట్రు పూర్ణచంద్రరావు శిబిరాన్ని సందర్శించి సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆడిటర్ రాఘవలు, పార్టీ సీనియర్ నాయకులు మేడమ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● వేల్పూరు (శావల్యాపురం): ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టడం జరిగిందని పల్నాడు జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పోట్రు పూర్ణచంద్రరావు అన్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాలమేరకు శావల్యాపురం మండలం వేల్పూరులో జరుగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ నేతలు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, మండల సభ్యత్వ ప్రముఖ్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం దుర్మార్గం: రమేష్

వేల్పూరు (శావల్యాపురం) సెప్టెంబరు 20: తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో జంతువుల కొవ్వును కలిపి తయారుచేసి అపవిత్రం చేయడం దుర్మార్గమైన చర్యని పల్నాడు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించేందుకు శుక్రవారం వేల్పూరుకు వచ్చిన రమేష్ మాట్లాడుతూ జంతువుల కొవ్వుతో లడ్డులను తయారుచేసి భక్తులకు పంపిణీ చేయడం హేయమని, ఇది హిందువులందరికీ అవమానకరమైన విషయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మొక్కుబడి తనిఖీలు వద్దు: బూదల

వినుకొండ టౌన్, సెప్టెంబరు 20: రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారులు మొక్కుబడి తనిఖీలు తగదని వినుకొండ సీపీఐ ఏరియా కార్యకార్శి బూదల శ్రీనివాసరావు మండిపడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్‌షాపుల్లో రేషన్‌కు బదులు, డబ్బులు ఇచ్చి పేదల కడుపు కొడుతున్నారని ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందచేశామనారు. ఈ ఆరోపనులపై విజిలెన్స్ అధికారులు మొక్కుబడి తనిఖీలు చేశారని, ప్రజాసంఘాలను, లబ్ధిదారులను విచారించకుండా వెళ్లిపోయారన్నారు. మూడు నెలలుగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేయకపోవడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విజిలెన్సు అధికారులు నిస్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాము, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, యోహాన్, నాసరయ్య, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పేదలకు అక్షయపాత్రలా అన్న క్యాంటీన్లు



అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి వడ్డిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 20: పేదలకు అక్షయపాత్రలా అన్న క్యాంటీన్లు సేవలందిస్తున్నాయని ఎమ్మెల్యే జీవీ ఆంజేయులు అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తల్లి పిల్లల వైద్యశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అని చాటి చెప్పిన మహానుబావుడు అన్న ఎన్టీఆర్ అన్నారు. పేదలకు, కార్మికులకు అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు మూసివేయించారని మండిపడ్డారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరెడ్డి ఫోటోలు పెట్టుకుని అన్న క్యాంటీన్లు మూసివేయించడం సిగ్గు చేటన్నారు. పేదవాడికి కడుపు నిండా అన్నం పెట్టడం తప్పా అని ప్రశ్నించారు. రూ.5లకే అన్నం పెట్టి పేదల ఆకలితీర్చే గొప్ప పథకాన్ని మూసివేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అందుకే ప్రజలు 93శాతం సీట్లు ఇచ్చి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఆశీర్వదించారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిలబెట్టుకున్నారని కొనియాడారు. వినుకొండలో అన్న క్యాంటీన్ ప్రారంభించడం సంతోషంగా ఉదన్నారు. హరేకృష్ణ వంటి ఆధ్యాత్మిక సంస్థలకు అన్న క్యాంటీన్ల బాధ్యత అప్పగించడం మరో ఆనందదాయకమైన అంశమన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిజాయితీగా పనిచేసే సంస్థలకు బాధ్యతలు అప్పగించి సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో మంచి పనిచేశారన్నారు. పూటకు ఐదు రూపాయలు, మూడుపూటల కేవలం రూ.15 రూపాయలతో పేదలు మూడు పూటలా కడుపు నింపుకునేలా ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లు చిరస్థాయిగా కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తన వివాహ దినోత్సం సందర్భంగా శివశక్తి లీలాఅంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి రూ.1,10,116 విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో అన్న క్యాంటీన్‌కు ఏ అవసరం వచ్చినా ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందచేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్టీఆర్‌పై ఉన్న అభిమానంతో టీడీపీ యువ నాయకులు సురేంద్ర ఆయన సతీమణితో కలిసి రూ.11వేలు, రైల్‌పేటకు చెందిన దావులూరి మునెయ్య రూ.5వేలు విరాళంగా కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు అందచేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల అభివృద్ధితో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వారం రోజుల పాటు వివరిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, ఈవీ సురేష్, బీజేపీ నాయకులు మేడమ్ రమేష్, ఆయుబ్‌ఖాన్, గందం కోటేశ్వరరావు, వాసిరెడ్డి లింగమూర్తి గట్టుపల్లి శ్రీనివాసరావు, పువ్వాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో మంచి పనులతో చరిత్ర సృష్టించిన ప్రభుత్వం



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 20: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పాలనలో చెయ్యలేని పనులు కూటమి ప్రభుత్వ హయాంలో కేవలం 100 రోజుల్లో ప్రజలకు 100 మంచిపనులు చేసి దేశ, రాష్ట్రంలో ప్రజలు మన్నలు పొందారన్నారు. వినుకొండ మండలం దొండపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం అని సంతోషం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో రూ.250 పింఛన్ పెంచారని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1000 పెంచారన్నారు. జగన్ రెడ్డి రాష్ట్రానికి 14లక్షల కోట్లు అప్పులు నెత్తిన పెట్టినా సంక్షేమానికి ఏచిన్న ఢోకా రానివ్వని ప్రభుత్వం మాది అని, ఇది గర్వంగా చెబుతున్నానన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం మెగా డీఎస్సీ ప్రకటించారని, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆగస్టు 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 13,326 పంచాయతీల్లో గ్రామ సభల ద్వారా రూ.4500 కోట్లు విలువైన ఉపాధిహామీ పనులకు తీర్మానాలు చేయించి సరికొత్త రికార్డు సృష్టించారని కొనియాడారు. ఇవేకాక గత ప్రభుత్వ హయాంలో రూ.1674 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కిందన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు మెండి బకాయిలు చెల్లించారని తెలిపారు. పేదల ఆకలి తీర్చడానికి రూ.5కే అన్న కాంటీన్ల ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల భూములకు ఎసరు పెట్టే ల్యాండ్ టైటిల్ విధానాన్ని రద్దు చేశామన్నారు. కార్యక్రమంలో మండపార్టీ అధ్యక్షుడు మాదినేని అంజనేయులు, మద్దుకూరి రామ బ్రహ్మం, జనసేన నాయకులు నాగశ్రీను, మక్కెన కొండలు, వజ్రాల కృష్ణారెడ్డి, ముత్తినేని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, శీలు బాబురావు, కనుమూరి లక్ష్మి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ కుమార్, కదం నాగజ్యోతి, మిరియాల వెంకట సుబ్బమ్మ, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ చట్టం రద్దు చేశాం: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వ ఏర్పడగానే ల్యాండ్ టైటిల్ చట్టం రద్దుచేసిందని, పేదల కోసం అన్న క్యాంటీన్లను ప్రారంభించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రకాష్‌నగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం జరిగిందని, మెగా డీఎస్సీ కోసం చట్టం చేశారన్నారు. దీనివల్ల 16వేల మందికి ఉద్యోగాలు రావడం జరుగుతుందన్నారు. వరదల కారణంగా విజయవాడలో ఇబ్బందులు వచ్చినప్పుడు బాధితులకు అండగా ఉండి ఆదుకున్నామన్నారు. ప్రతి ఇంటికి రూ.25వేలు సాయం చేయడం జరిగిందన్నారు. రూ.25వేలు బ్యాంకులో రుణాలు కూడా ఇప్పించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అందరికీ ముఖ్యంగా కౌలు రైతులకు అండగా ఉందన్నారు. రాబోయే రోజులలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వం పూనుకుందన్నారు. దసరాకు ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నారని, రాబోయే కాలంలో ఉచిత బస్ ప్రయాణం, ప్రతి నెల తల్లికి వందనం కార్యక్రమం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, నేలటూరి మురళి, బులియన్ మర్చంట్స్



బొల్లాపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సుధాకర్

మంచి ప్రభుత్వంపై ఇంటింటి ప్రచారం

బొల్లాపల్లి, సెప్టెంబరు 20: ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు గ్రామాల్లో మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం బొల్లాపల్లిలో తహసీల్దార్ ఏ సుధాకర్, ఈవోపీఆర్‌డీ జిలానీ బాషా ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో జరిగిన మంచి పనుల గురించి ప్రజలకు తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం: మండల టీడీపీ అధ్యక్షుడు సాయిబాబు

యడ్లపాడు, సెప్టెంబరు 20: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బోయపాలెంలో జరిగిన కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, మండల ప్రత్యేక అధికారి బాలసుబ్రమణ్యం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీవో హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధిని తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, వంద రోజుల కాలంలో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, టీడీపీ నాయకులు హిమవంతరావు, శేషయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, ఎన్.హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

● నూజెండ్ల: మండలంలోని రవ్వవరంలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో పద్మ, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఈపూరు: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై శుక్రవారం ఈపూరులో మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు వివరించారు. ప్రత్యేకాధికారి రమణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లమీసాల చెంచయ్య, ఎంపీడీవో ఏవీ రంగనాయకులు, తహసీల్దారు నళిని, టీడీపీ నాయకులు సుబ్బారావు, డేవిడ్ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచనలతో శుక్రవారం చిలకలూరిపేట మండల టీడీపీ అధ్యక్షుడు జవ్వాజి మదనమోహన్ ఆధ్వర్యంలో రాజాపేట, మురికిపూడి గ్రామాలలో మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ స్పెషల్ నోడల్ అధికారి నారదముని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి జి.శ్రీనివాసరావు కార్యక్రమాలలో పాల్గొన్నారు.

● కాగా పట్టణంలోని పలు వార్డులలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి వంద రోజుల మన మంచి ప్రభుత్వం గురించి గురించి వివరిస్తూ వారి గోడలకు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరీముల్లా, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్ధుమాల రవి, మిరియాల రత్నకుమారి, తెలుగు మహిళ అధ్యక్షురాలు అమరా రమాదేవి, తెలుగుదేశం అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు, పార్టీ నాయకులు, పలువురు మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండలస్థాయి స్కూల్ గేమ్స్

యడ్లపాడు, సెప్టెంబరు 20: మండల కేంద్రమైన యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 200మందికి పైగా విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారి నాగరత్నం ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పాఠశాల ప్రదానోపాధ్యాయులు విజయబారతి పర్యవేక్షణలో మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ కె మధుబాబు, పీఈటీలు పాల్‌సుధాకర్, మాధురి రాణి, మేరీ శౌరీలు, శ్రీనివాసరావు, ఆశితున్, అజయ్ తదితరులు పోటీలను నిర్వహించి క్రీడాకారులను ఎంపికచేశారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడలు కోలాహలంగా జరిగాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని పలు పాఠశాలలకు చెందిన రెండు వందల మంది బాల బాలికలు హాజరయ్యారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎం వీ వెంకటరావు, పీడీ అంజమ్మ, పీఈటీలు పీవీ నాగరాజు, ఎంవీ సుబ్బారావు, పిలిప్‌రాజు, బాజీ, రషీద, శ్రీను తదితరులు పర్యవేక్షించారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలను ఎంఈవో పార్వతి శుక్రవారం ప్రారంభించారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయిలకు పంపించటం జరుగుతుందని, ముందుగా వెల్లటూరులో ఖోఖో, కబడ్డీ పోటీలు ఆడిన విద్యార్థులకు బొల్లాపల్లిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులను ఎంపిక చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: స్థానిక జడ్పీ పాఠశాలలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక శుక్రవారం జరిగింది. పోటీలను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ఇట్టె ఏడుకొండలు ప్రారంభించారు. పోటీల్లో ఎంపికైన వారు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ సుభానీ తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండల స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ శుక్రవారం జిల్లాపరిషత్ హైస్కూల్ వేలూరు క్రీడా ప్రాంగణంలో జరిగాయి. ఈ పోటీలకు చిలకలూరిపేట మండల పరిధిలో ఉన్న హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, కోకో గేమ్స్ అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు టోర్నమెంట్ కం సెలక్షన్స్ జరిగాయి. ఈ పోటీలకు మండల పరిధిలోని హైస్కూళ్ళ నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా వందరోజుల ప్రజాపాలన

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం హామీలను నెరవేరుస్తూ ప్రజలకు చేరువగా వంద రోజుల పాలన పూర్తి చేసుకున్నదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను కూటమి ప్రభుత్వం నిలుపుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వంద రోజులలో కేవలం రూ.250లు పింఛన్ పెంచారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పెంచిన పింఛన్ మొత్తాన్ని రూ.7వేలు అందించి మాట నిలబెట్టుకుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నెల రోజుల పాటు వేతనాలు వేసేవారని, ఇప్పుడు ఉద్యోగులకు నెల మొదటి రోజునే అందుతున్నాయన్నారు. ప్రజాపాలనలో వంద రోజులలో నిరుద్యోగులకు డీఎస్సీ విడుదల చేశామన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. జలజీవన్ పథకంలో వైసీపీ ప్రభుత్వం రూ.4500 కోట్లు స్కామ్ చేసి ప్రజలకు ఇంటింటికి వేయాల్సిన కుళాయిలు ఆగిపోయాయన్నారు. ప్రజలకు ఈ వంద రోజులలో చేసిన మంచిని తెలిపేందుకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

నేడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక

రొంపిచర్ల, సెప్టెంబరు 20: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రజా వేదిక కార్యక్రమం జరగనుంది. పనులు, వేతనాలకు సంబంధించి వారం రోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. మొత్తం 11.66 కోట్లకు సంబంధించి ప్రజా వేదిక కార్యక్రమం జరగనుంది.

28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు, సెప్టెంబరు 20: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28న జరుగుతుందని ఎంపీడీవో వై హనుమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు అభివృది కార్యక్రమాలపై శాఖల వారీగా సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని సూచించారు.

టీడీపీ నాయకుడి కారు దహనం

బొల్లాపల్లి, సెప్టెంబరు 20: మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు పోకా వెంకటరావుకు చెందిన కారుకు గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. ఇంటి వద్ద పార్కు చేసి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్‌పోసి నిప్పంటించటంతో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల వారు చూసి మంటలను ఆర్పివేయటంతో కారు పాక్షికంగా దెబ్బతింది. వెంకటరావు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ ఏ బాలకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మోడల్ పాఠశాలలో కంటి పరీక్షలు

బొల్లాపల్లి, సెప్టెంబరు 20: మండల కేంద్రమైన బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం 389మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 22మందికి కళ్ళ జోళ్ళు అవసరమని గుర్తించామని, వీరికి త్వరలోనే కళ్ళ జోళ్ళు పంపిణీ చేస్తామని వినుకొండ అర్బన్ ఆప్త్రాలజీ షేక్ చాంద్ బాషా తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో పార్వతి, పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆషా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటికి పలువురి పరామర్శ

చిలకలూరిపేట, సెప్టెంబరు 20: స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి నారాయణమ్మ ఇటీవల కన్నుమూసింది. ఈ సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు ఆయన స్వగృహానికి ఆయనను వచ్చి పరామర్శించారు. నారాయణమ్మ చిత్రపటం వద్ద సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నాగేంద్ర, కార్యదర్శి గుర్రం నాగపూర్ణ చంద్రరావు, ముద్దన నాగేశ్వరరావు, ఎస్ లోకబ్రహ్మాయ్య, రామకృష్ణ, తోట రాజా రమేష్ తదితరులు నివాళులర్పించారు.

కావూరు హైస్కూల్ విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్

చిలకలూరిపేట, సెప్టెంబరు 20: చిలకలూరిపేట మండలం కావూరు హైస్కూల్‌కు చెందిన 9, 10 తరగతుల విద్యార్థులు 53మంది శుక్రవారం నాదెండ్ల మండలం గణపవరంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్పిన్‌టెక్ పరిశ్రమకు ఇండస్ట్రియల్ టూర్‌కు వెళ్లారు. వారికి సంస్థ జనరల్ మేనేజర్ గిరిధర్ పత్తి నుంచి దూది, దూది నుంచి దారం, తయారుచేసే విధానం వివరించి చూపారు. వారివెంట ఒకేషనల్ ట్రైనర్ పి.లత, ఉపాధ్యాయులు అజయ్‌బాబు, బాలరాజు, లక్ష్మీప్రసన్న ఉన్నారు.

23న సత్తెనపల్లిలో జాబ్ డ్రైవ్

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు, 20. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఈ నెల 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 4కంపెనీలు పాల్గొంటున్నట్లు అయన చెప్పారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హతలు ఉన్నటువంటి 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో తీసుకుని ఇంటర్వ్యూకు హాజరవ్వాలన్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. వివరాలకు ఇ.రామకృష్ణారెడ్డి 8074393466, బి.అంజిరెడ్డి 9494986164 సంప్రదించాలని కోరారు.



గోగులపాడు జడ్పీ పాఠశాలలో స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

రొంపిచర్ల, సెప్టెంబరు 20: మండలంలోని గోగులపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. బొల్లు రాజేశ్వరి, వెంకట కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వై హనుమంతరావు, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: తహసీల్దార్

వినుకొండ టౌన్, సెప్టెంబరు 20: డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన తీసుకుంటామని తహసీల్దార్ సురేష్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం రేషన్ షాపు డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎటువంటి ఆటంకం లేకుండా సరుకులు అందించాలన్నారు. అవకతవకలపై ఏమైనా ఫిర్యాదులు వస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.